దశాబ్దాలుగా మారని దారిద్ర్యం

- గుంతలమయంగా రోడ్డు
- అభివృద్ధికి నోచుకోని మర్లపాలెం ప్రధాన రహదారి
- రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు


అధ్వానంగా ఉన్న గ్రావెల్ రోడ్డు

గన్నవరం: స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి నుంచి మర్లపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ రహదారిపై కనీసం వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో రాత్రివేళలో రాకపోకలు సాగించలేకపోతున్నామని చెబుతున్నారు. వివరాలిలా వున్నాయి. చెన్నై-కోల్‌కత జాతీయ రహదారి నుంచి మర్లపాలెం వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ఈ రహదారి విస్తరించి ఉంది. ప్రయాణ, వ్యవసాయ అవసరాల నిమిత్తం గ్రామస్తులు ఎక్కువగా ఈ రహదారిని ఉపయోగిస్తుంటారు. ఈ రహదారిని సుమారు పదేళ్ల క్రితం గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. అనంతరం 2018లో యూఎస్‌పి తరహాలో కెమికల్, రబ్బీస్, మట్టితో ప్రయోగాత్మకంగా చేపట్టిన రోడ్డు నిర్మాణం ఫలితాన్ని ఇవ్వలేదు. అప్పటినుంచి ఈ రహదారి అభివృద్ధి గురించి పాలకులు, అధికారులు గాలికి వదిలేశారు.

గతుకుల రోడ్డుతో...

గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి మర్లపాలెం, జగనన్న కాలనీ, తెంపల్లి, బల్లిపర్రు గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలోనే పలు బహుళ అంతస్తుల భవనాలు, మెకానికల్ షెడ్లు, ఎక్సైజ్ కార్యాలయం ఉన్నాయి. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ఈ రహదారి గతుకుల మయంగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. కనీసం ఈ రహదారిపై ఉన్న పంచాయతీ వీధిలైట్లు కూడా వెలగకపోవడంతో గాఢాంధకారం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస హేచరీస్ ఎదురుగా రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన బీటీ రోడ్డుపై తారులేచి, రాళ్లు తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాత్రివేళల్లో రాకపోకలకు అనువుగా వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

నిధులు కేటాయించాలి

జాతీయ రహదారి నుంచి మర్లపాలెం వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధిపై పాలకులు, అధికారులు దృష్టి పెట్టాలి. దెబ్బతిన్న రహదారిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలి. దీనివల్ల మర్లపాలెంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–ఎస్.ఆంజనేయులు, మర్లపాలెం

రోడ్డు అభివృద్ధి చేయాలి

ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో మర్లపాలెం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారింది. పాలకులు స్పందించి ప్రాధాన్యతా క్రమంలో ఈ రహదారిని అభివృద్ధి చేయాలి. దీనివల్ల వ్యవసాయ ఆధారితమైన మర్లపాలెం గ్రామానికి చెందిన రైతులు పంట ఉత్పత్తులను బయటకు తరలించేందుకు సులభతరంగా ఉంటుంది.

–ఎం.నాగేశ్వరరావు, గన్నవరం

క్లుప్తంగా

కార్మిక చట్టాలు లేకుండా చేసేందుకే లేబర్ కోడ్‌లు



గన్నవరం: కార్మిక చట్టాలు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. పోలినాయుడు అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా పంచాయతీ కార్మికులకు ఏ చట్టం అమలు చేయకుండా పాలకులు దగా చేస్తున్నారని మండిపడ్డారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు బెజవాడ తాతబ్బాయి, యూనియన్ నేతలు గణేష్, దానియేలు, నాగమణి, లక్ష్మీకోటేశ్వరరావు, నాగరాజు, లవరాజు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా డ్రెయిన్ నిర్మాణ పనులు

నున్న(విజయవాడరూరల్): గ్రామ పంచాయతీ నిధులు రూ. 20 లక్షలతో ఇందిరా కాలనీ ట్యాంక్ నుంచి నూజివీడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు సమాన ఎత్తులో డ్రెయినేజీ ఉండటంతో ఎప్పుడు వర్షాలు కురిసినా డ్రెయిన్ పొంగి వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందిపడుతుండేవారు. ప్రస్తుతం డ్రెయిన్‌ను రోడ్డుకు రెండు అడుగుల ఎత్తుతో నిర్మించడంతో భవిష్యత్‌లో డ్రెయిన్ పొంగి ప్రవహించే అవకాశం ఉండదని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీరు ఎస్.శివరామ్‌కృష్ణ తెలిపారు. డ్రెయిన్ నిర్మాణం పూర్తయిన వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



పెనమలూరు: గంగూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొక్కిలిగడ్డ చిట్టిబాబు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం అందించింది. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ. 10 వేలు, గ్రామ వైఎస్సార్ సీపీ రూ. 10 వేలు కలిపి మొత్తం రూ. 20 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నందేటి దేవమణి, పంచాయతీ వార్డు సభ్యుడు గని, మాజీ ఉప సర్పంచి ఇస్మాయిల్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు చిట్టూరి సుబ్బారావు, బాబూరావు పాల్గొన్నారు.

వాలి నాయక్ కుటుంబానికి చక్రవర్తి పరామర్శ



ఉయ్యూరు రూరల్: ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామ నివాసి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన బాణావత్ వాల్యా నాయక్ గుండె పోటుతో మరణించడం బాధాకరమని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. శనివారం వాలి నాయక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు సంజీవరెడ్డి, తూమాటి గిరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమరులకు విద్యార్థుల చిత్ర నివాళి


విద్యార్థులు చిత్రీకరించిన పహెల్‌గావ్ మృతులు

పెనమలూరు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన పౌరుల చిత్రాలను విద్యార్థులు చిత్రీకరించి నివాళులర్పించారు. కృష్ణా జిల్లా సంస్కార భారతి శాఖ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించామని విశ్రాంత డ్రాయింగ్ టీచర్ ఆరేపల్లి అప్పారావు తెలిపారు. ఉగ్రమూకల కాల్పుల్లో అమరులైన పౌరుల చిత్రాలను పది రోజుల శిక్షణలో విద్యార్థులు చిత్రీకరించారని చెప్పారు. పోరంకి పాఠశాలలో శనివారం జరిగిన శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులు అమరులకు పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆరేపల్లి అప్పారావును సంస్కార భారతి నిర్వాహకులు సత్కరించారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.సుమలత, సంస్కార భారతి రాష్ట్ర, జిల్లా నాయకులు పీవీఎన్ కృష్ణ, డి.శ్రీనివాస్, సుహాసిని, విద్యాధరి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో రుబీనా 4కే-3డీ ఐసీజీ సేవలు


మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

పెనమలూరు: భారతదేశంలో మొట్టమొదటిసారిగా పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో కర్ల్ స్టోజ్ ఇమేజ్ 1ఎస్ రుబీనా 4కే-3డీ ఐసీజీ 55'' అల్ట్రా హెచ్‌డీ మానిటర్ అనే అధునాతక పరికరం సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నే హరీష్ తెలిపారు. క్యాపిటల్ ఆస్పత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 55'' అల్ట్రా హెచ్‌డీ మానిటర్ పరికరంతో జనరల్ సర్జరీలు, గైనకాలజీ సర్జరీలు, ఎండో మెట్రియోసిస్ సర్జరీలు చేయగలుగుతామన్నారు. జీఐ బేరియాటిక్ సర్జన్ డాక్టర్ వి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ పరికరంతో సంక్లిష్ట శస్త్రచికిత్సలు అత్యంత ఖచ్చితత్వంతో చేయగలుగుతామన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్స సూక్ష్మమైన లోపాలను కూడా ముందుగానే గుర్తించి రోగి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. గైనకాలజిస్టు డాక్టర్ నేలవెల్లి అశ్విని మాట్లాడుతూ సంక్లిష్టమైన ఎండో మెట్రియోసిస్ పెద్ద కణితలు, లాపరోస్కోపిక్ గైనకాలజీ శస్త్రచికిత్సలు నైపుణ్యంతో చేయవచ్చన్నారు. డాక్టర్ డి.త్రివేది, డాక్టర్ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా


మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు


కాసరనేనిపాలెం సభలో మాట్లాడుతున్న బాకీబాబు

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకంపై ప్రత్యేక సింగిల్ విండో డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం క్రింద సోలార్ యూనిట్‌లు మంజూరైన 12 మంది లబ్ధిదారులకు ఎంపీపీ వడ్లమూడి సరోజిని, మండల ప్రత్యేకాధికారి, డీఈఓ పీవీజే రామారావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సర్పంచి బి. ఎస్తేరమ్మ చేతుల మీదుగా పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ పథకం వల్ల విద్యుత్ బిల్లులను గణనీయంగా ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్ యూనిట్లను ప్రభుత్వం రాయితీపై అందజేయడంతో పాటు బ్యాంక్‌ల నుంచి రుణ సదుపాయం కల్పిస్తోందని చెప్పారు. బ్యాంక్ రుణంపై సోలార్ యూనిట్ల కోసం 83 మంది గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాస్, పలువురు అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కంకిపాడు: పీఎం సూర్య ఘర్‌తో గ్రామాల్లో వెలుగులు నిండుతాయని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. పీఎం సూర్యఘర్ సింగిల్ విండో కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్ కాసరనేనివారిపాలెంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సబ్సిడీతో కూడిన ప్రయోజనాలు ఉన్న పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం సూర్యఘర్‌కు 18 మంది స్థానికులు ముందుకు రావటంతో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యుత్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళీకిశోర్, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, డీఈఈ బి.నవీన్‌కుమార్, ఏఈ అశోక్‌కుమార్, సర్పంచ్ పి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో డస్ట్ బిన్‌ల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున రూ. 10 వేల విలువ చేసే 18 డస్ట్‌బిన్లను హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. వీటిని ఆర్టీసీ గన్నవరం డిపో మేనేజర్ శివాజీకి శనివారం అందజేశారు. మానవత సభ్యులను ఆయన అభినందించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, నూజివీడు, హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్షులు కృష్ణప్రసాద్, గూడపాటి జయరామచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు నమోదు

రామవరప్పాడు: మహిళపై దౌర్జన్యం చేసి అసభ్య ప్రవర్తనతో దుర్భాషలాడిన ఘటనపై ఫిర్యాదు అందడంతో పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు టయోటా షోరూమ్ పక్క వీధిలో బండి జయశ్రీ తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటోంది. ఇదే ప్రాంతానికి చెందిన రోషి బాబు బండి జయశ్రీని అసభ్య ప్రవర్తనతో వేధిస్తున్నాడు. తరుచూ మద్యం సేవించి వచ్చి బూతులు తిడుతూ గొడవకు దిగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 8న రోషి బాబుతో పాటు అతని భార్య తిరుపతమ్మ, సోదరి దుర్గా భవానీలు జయశ్రీ ఇంటిపైకి వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగారు. రోషి బాబు నిన్ను చంపేస్తానంటూ బెదిరించాడు. బాధితురాలు జయశ్రీ పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రోషిబాబు, తిరుపతమ్మ, దుర్గా భవానీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వృద్ధురాలు అదృశ్యమైంది. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి కరణంగారి బజార్‌కు చెందిన దావు భాగ్యలక్ష్మి (68) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. కొన్ని రోజుల కిందట ఆమె పోరంకిలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరింది. ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. ప్రసాదంపాడులోని బంధువులు ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. ఆమె బంధువుల ఇంటికి వెళ్లలేదని తెలియడంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద విచారణ చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు భాగ్యలక్ష్మి కుమార్తె పుష్పరాణి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీల్లో తల్లికి వందనం


కాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల నుంచి ఆశీర్వాదం పొందుతున్న చిన్నారులు


వణుకూరులో తల్లులకు వందనం చేస్తున్న చిన్నారులు

ఉయ్యూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను తల్లులు అక్షింతలతో ఆశీర్వదించారు. చిన్నారులు తమ తల్లుల కాళ్లకు వందనం చేశారు. కంకిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజినీ మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల, సమాజం పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పెనమలూరు: మదర్స్ డే సందర్భంగా మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కానూరు మురళీ నగర్‌లో సంప్రదాయ పద్ధతిలో పిల్లలు తల్లుల కాళ్లుకడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నవ మాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని ప్రతీ బిడ్డ గౌరవించాలన్నారు. గోసాల, గంగూరు, వణుకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తల్లుల కాళ్లు కడగగా, తల్లులు పూలతో పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కాశేశ్వరిదేవి, వి.జ్యోతి, పి.అనిత, పి.రంగమ్మ, కె.శిరీష, కె.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకీ అవస్థలే

- అంబాపురంలో ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం సమస్య
- ఆక్రమణకు గురైందనే ఆరోపణలు


రోడ్డును ఆనుకొని ఉన్న సమాధులు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటికకు స్థలం చాలక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అనాదిగా ఉన్న శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలకు గురికావడంతో ఎవరైనా చనిపోతే మట్టి చేసి సమాధి నిర్మించడానికి స్థలం చాలక నానా ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికను ఆనుకొని వ్యవసాయ పొలాలు ఉండటంతో కొంత ఆక్రమణలకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని మట్టి చేయడానికి గొయ్యి తీసిన వెంటనే నీళ్లు వస్తున్నాయని, వర్షాకాలంలో అయితే ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పాత సమాధులున్న స్థలంలోనే మళ్లీ సమాధి నిర్మించాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అమర జవాన్‌కు వైఎస్సార్ సీపీ నివాళి


మురళీ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: భారతదేశం కోసం ప్రాణాలు అర్పించి అమరుడైన వీర జవాన్ మురళీనాయక్‌కు వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కానూరు కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి అమాయక ప్రజల ప్రాణాలు బలికొంటోందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ అమరుడని కొనియాడారు. పార్టీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పి.రాఘవరావు, అష్రఫ్, చాంద్‌బాషా, నాయకులు కరీం, ఎండీ.బాషా (కత్తెరబాషా) తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్య లేకుండా చర్యలు

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


నున్న గ్రామ సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చెత్త సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాసరావుకు సూచించారు. నున్న గ్రామంలో శనివారం జరిగిన ప్రైవేటు ఫంక్షన్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో చెత్త సేకరించే విషయంపై ఆరా తీసి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగు పడే విధంగా అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తాగునీటి సరఫరా విషయాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ వార్డు సభ్యులు, పార్టీ ప్రతినిధులు ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఉన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వసంత వేణుగోపాలస్వామి

పెనమలూరు: పోరంకి గ్రామంలోని వసంత వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు స్వామివార్లను పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పార్థనా సూక్తం, విశ్వక్సేన పూజ, అంకురారోహణ, వాస్తు హోమం, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11న ఉదయం 8 గంటలకు నిత్య హోమం, 9 గంటలకు శ్రీకృష్ణ మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 7.30 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణోత్సవం జరుగుతుందని ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు



కంకిపాడు: రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర అన్నారు. గ్రామంలో రూ. 20 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ఆమె ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, రవికిశోర్, సంగీతరావు, పందిపాటి సుధాకర్, డొప్పల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేల జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10వేలు జరిమానా విధిస్తామని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగటమే కాకుండా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆటోనగర్ యజమానులకు సమ్మె నోటీసు



పెనమలూరు: ఈ నెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెకు కానూరు ఆటోనగర్‌లోని యాజమానులు మద్దతు పలకాలని కృష్ణా జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు ఆటోనగర్‌లో శనివారం యజమానులకు సమ్మె నోటీసు ఇచ్చి, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెను అన్నివర్గాల వారు విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల హక్కులకు భంగం కలుగకుండా ఉండాలంటే సమ్మెలో కార్మికులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నేతలు రాజేశ్వరరావు, వెంకటరెడ్డి, సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.